


# ఎదురు చూసిన క్షణం

వై. మీనాక్షి

పుష్యమాసం! చీకట్లు వీడలేదు... బద్ధకంగా వున్న సూర్యుడికి కూడా ఉదయించ బుద్ధి పుట్టడంలేదు. ఓరుచలి రగ్గునుదాటి శరీరాన్ని తాకి గిలిగింతలు పెడుతున్నది. మంచం మీద పిల్లికిలా పడుకుని నడుందాకా రగ్గుంచుకొని, రెండుచేతులు తలక్రింద పెట్టుకొని ఆలోచనలో పడింది పాప.

"అమ్మాయిగోరూ... ఇంకా తొంగున్నారేటి... లెగండి... లెగండి... రావులు అకాశమంత ముగ్గు ఏడతన్నది. దొడ్లోకి సూడండి... ఇయ్యాల యెంత పేడ తెచ్చానో..." సుప్రభాతం పలికాడు వెంకడు.

రోజూ ఈ పాటికి లేచేసి రాములు వేసే ముగ్గుల్ని చూస్తూ మురిసే పాపకు యివాళ మంచం వదలబుద్ధిపడంలేదు. మనసంతా... ఏదో తియ్యగా ఉంది. ఎంతో సంబరంగా వుంది. దేనికో తొందరపడుతున్నది. రెండేళ్ళుగా ఎదురుచూస్తున్నరోజు రానే వచ్చింది. ఇంకో గంటో... రెండుగంటలో... అంతే!

వెంకడు మళ్ళీ నోరెత్తేలోగానే, ఠంగున మంచం దిగింది. కాళ్ళకున్న గజ్జెలు ఘల్లుమన్నాయి.

"అమ్మో మెలకువగా ఉందేనా!... పెద్ద దొంగవై పోతావున్నావమ్మా! అమ్మగారు రానీ నీ పని చెప్తతా" అన్నాడు వెంకడు నవ్వుతూ, పక్కబట్టలు మడతలు పెడుతూ!

నాలుక బయటపెట్టి వెంకడిని వెక్కిరించి పెరట్లోకి పరిగెత్తింది గబగబా మొహం కడిగేసి దేవుడి గదిలోకి వెళ్ళింది. అప్పుడే పూజకోసం పూలుకోసిన తాతయ్య విడిగా నాలుగు గుమ్మడి పూలు, బంతిపూలు కోసి ప్రక్కగా ఉంచాడు. రాత్రి మంచులో తడిసిన గుమ్మడిపూలు మిలమిల్లాడుతున్నాయి. సందివర్ధనాల ఘుమఘుమ గదంతా ఆవరించింది. ప్రక్కన ఒక పండపాళిలో పసుపు, కుంకుమ, బియ్యప్పిండి, అక్షింతలు, బెల్లంముక్క నైవేద్యంకోసం అట్టిపెట్టి వున్నాయి. రోజూ అమ్మమ్మ తన కోసం సిద్ధంగా ఉంచుతుంది.

పూలపళ్ళెం, పండపాళి పట్టుకొని తిరిగి పెర

## ఎదురు చూసిన క్షణం

ల్లోకి వెళ్ళింది. అప్పుడే రాములు ముగ్గులు పూర్తి చేసొచ్చి. గొబ్బెమ్మలు చేయడం కోసం పేడ పిసుకుతున్నది.... రాములు సహాయంతో గొబ్బెళ్ళు చేసింది. పసుపు కుంకుమ పూలు అన్నీ అమర్చింది. అమ్మమ్మ పెట్టిన బెల్లం ముక్క నైవేద్యం పెట్టి ఒకసారి అరచేతులతో చప్పట్లు చరుతూ "సుబ్బి గొబ్బెమ్మా...... యివ్వవే" పాటపాడి. ప్రసాదం తుంచి రాములుకి ఒకముక్క పెట్టి తనూ నోట్లో వేసుకొని గొబ్బెమ్మలపీట తీసుకొని వీధిలోకి వెళ్ళి, తామరాకులాగ పరుచుకొని వున్న ముగ్గుల మీద ఉంచింది.

తొలి వెలుగులో... కన్నెపిల్లల గలగలలతో వీధంతా సందడిగా ఉంది... ఎవరి వాకిట్లో పెద్దముగ్గు వుందో... ఎవరెన్ని గొబ్బెమ్మలు పెట్టారో...అందరికి పోటీ ..

పెరట్లోకి పరుగెత్తి చేతులు శుభ్రంగా కడుగుకొని గదిలోకి వెళ్ళింది. టైము 6-30 అయింది. సుమారుగా యింకో 2, 3 గంటలలో అమ్మా నాన్నా వచ్చేస్తారు. తమ్ముడు ఎలా వున్నాడో!... తలెత్తి గోడమీద వున్నఫోటో వంక చూస్తూ! అమ్మ రూపాన్ని గుర్తు తెచ్చుకొనేందుకు బలవంతంగా ప్రయత్నించింది. ఏదో పాత వడిపోయిన బొమ్మలా... మసుగు వడిపోయిన రూపం అలుక్కుపోయి కనుపించింది.

ఏడెనిమిదేళ్ళ క్రితం జరిగిన సంఘటన మాత్రం లీలగా జ్ఞాపకం ఉంది. ఆ రోజు! అమ్మను పీటమీద కూర్చోపెట్టి పట్టుచీర. పళ్ళు ఒళ్లో పెట్టింది అమ్మమ్మ. ఆ చీర కట్టుకొని అమ్మ అమ్మమ్మకు తాతయ్యకు వంగి కాళ్ళకు నమస్కారం చేసింది. తనని గట్టిగా గుండెలకదుముకొని, రెండు బుగ్గలమీద ముద్దు పెట్టుకొంది. "అల్లరి చేయకు! అమ్మమ్మ చెప్పినట్లు విని బుద్ధిగా చదువుకో" అని యింకా ఏవేవో చెప్పింది...... మూరెడు కనకాంబరాల దండ తెచ్చి......

'ఊరుకుందూ, ఏదో అత్తారింటికి అంపకాలు పెడుతున్నట్లు చెబుతున్నావు!... నీ కూతుర్ని బాగానే పెంచుతానులే! రెండేళ్ళల్లో నా కూతురే అంటూ తీసుకుపోవు!" అంటూ అమ్మమ్మ పూలదండ అమ్మ జడలో పెట్టింది.

అమ్మ వెళ్ళిపోయింది. అమ్మమ్మ తాతయ్య యెప్పుడూ... "అమ్మ అమెరికాలో ఉన్న నాన్న దగ్గరికి వెళ్ళిందే! అక్కడ బోలెడు బొమ్మలు, గౌనులు ఉంటాయి అన్నీ తెస్తుంది నీకు" అని తను అమ్మనిగురించి అడిగినప్పుడల్లా చెబుతూ ఉండేవారు.

పాపకు చిన్నప్పటి నుండి అమ్మమ్మ దగ్గరే అలవాటు ఎక్కువ అవడం వలన, అమ్మ వెళ్ళిందన్న బెంగ యేమీలేకపోయింది.

రెండేళ్ళలో వస్తుందనుకొన్న అమ్మ మాత్రం రాలేదు ఒకరోజున తనకు తమ్ముడు పుట్టాడని చెప్పి ఆనందంగా ఊరంతా మిఠాయి పంచి పెట్టింది అమ్మమ్మ.

తరువాత నుంచి పాపను అమెరికా పంపమని. విమానంలో అన్ని జాగ్రత్తలు తీసుకొంటారని ఏమీ భయం ఉండదనీ అమ్మ ఎప్పుడూ రాస్తూ ఉండేది. కానీ అమ్మమ్మకి మాత్రం ఒంటరిగా పంపడం యిష్టం లేదు. తీరా! అక్కడికి వెళ్ళాక తమకోసం పాప బెంగపెట్టుకుంటుందేమోనని ఆవిడ భయం. అందుకనే "నువ్వే వచ్చి నాలుగు నెలలుండి. పాపని అలవాటు చేసుకొని తీసుకువెళ్ళమని" జవాబుగా అమ్మమ్మ రాసేది.

పాప యిప్పుడు పన్నెండు సంవత్సరాల పల్లె పడుచు. ఉదయం నుండి అమ్మా, నాన్నని చూడటానికి ప్రతిక్షణం ఎదురు చూస్తున్నది.

వెంకడొచ్చాడు మళ్ళీ. "అమ్మాయిగోరూ. పీళ్ళెట్టా! తానం గమ్మని పేసెయ్యండి" అంటూ.

"నువ్వొకడివి. నా ప్రాణం తియ్యడానికి! ఒక్కపని క్షణం ఆలస్యం అవనియ్యవు."... విసుగ్గా లేచింది తువ్వాలు తీసుకొని.

అరగంటనుండి ముస్తాబు అవుతున్నా అసంతృప్తిగానే ఉంది పాపకు... నల్లటి కాటుక కళ్ళు చక్రాల్లా ఉన్నాయి. పొడుగ్గా దోసగింజలా పెట్టుకున్న నల్లబొట్టు నుదుటి వైశాల్యాన్ని కొలుస్తోంది. చెవులకు ఊగుతున్న రాళ్ళ జూకాలు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకుంది. ఊదారంగులో అరచేతి వెడల్పు జరీ అంచుతో ఉన్న పట్టు పరికిణీ మీద సన్నటి నడుంకు మెరుస్తున్న గజ్జెల వడ్డాణం పెట్టింది.

నల్లతాచులా వున్న జడ చివర కుచ్చుల ముడి బిగువుచేస్తూ (అమ్మమ్మ ఎప్పుడు జడ వేసినా. నీకు మీ అమ్మజుట్టు వచ్చిందే! అచ్చు అమ్మజడ యిలాగే ఉండేది...... అని)

"అమ్మరాగానే చూడాలి. ఎవరిది పెద్దజడో చూడాలి."

"ఏమిటే! నీ సింగారం...యింకా కాలేదూ! వస్తున్నది మీఅమ్మ,నాన్న...పెళ్ళికొడుకుకాదు" అంది అమ్మమ్మ బంతిపూలు. రుద్రజడ కలిపి కట్టినమాల తలలో పెడుతూ.

"పో!... అమ్మమ్మా... నువ్వు మరీను!" అంది సిగ్గుపడుతూ! "అంతా నాకే పెట్టెయ్యకు, అమ్మకుకూడా ఉంచుదాం" అమాయకంగా అంది.

"అమ్మకు కనకాంబరాలు కోసుకురా! మాల కడతాను." చెంగున పెరట్లోకి పరుగెత్తింది.

విరగబూసిన కనకాంబరాలు కబుర్లాడుతున్నాయి. మందహాసంతో పాపని పలకరిస్తున్నట్లున్నాయి. పరికిణి ముందుకు పట్టుకొని కోస్తున్న పూవులన్నీ అందులో వేస్తున్నది. మనస్సులో రకరకాల ఆలోచనలతో! మరువం. కనకాంబరాలు కలిపి ముద్దగా, గుత్తంగా తనే కట్టాలి, అమ్మమ్మ తొందరగా కడుతుందేగాని. అందంగా కట్టదు. ఆ మాల చూసి అమ్మ పొంగి



పోయి "నా బంగారుతల్లి యెన్ని నేర్చుకున్నావు" అనాలి.

అమెరికాలో బోలెడు బొమ్మ లుంటాయట... తన బొమ్మలకొలువు చూసి తమ్ముడేమంటాడో! ఈసారి ఎప్పుడూకంటె ఎక్కువమంది పేరంటాళ్ళని పిలవాలి. తమ్ముడుకూడా ఉన్నాడుగా భోగిపళ్ళకు.

అన్నట్లు తన స్నేహితురాలు సుందరిని పిలుచుకు రావాలి దానికి తనకంటే తొందరగాఉంది. అమ్మని చూడాలని. తనకంటే దిగులుగాఉంది. తను అమెరికా వెళ్ళిపోతానని. తను పుట్టాక విమానం ఒక్కసారిచూసింది. అదైనా పెదనాన్న కూతురుపెళ్ళికి పట్నం వెళ్ళినపుడు. "అమ్మో అంతఎత్తున ఎగిర్తే కళ్ళు తిరగవూ." అది ఎక్కాలంటే సంబరం. అమ్మమ్మని వదిలి వెళ్ళాలంటే దిగులు. తనని అమ్మా. నాన్న తీసికొని వెడతారట.

కారుహారన్ భంయ్యిమంది.

"అమ్మాయిగోరూ" అని అరిచాడు వెంకడు.

ఆలోచనలో వున్న పాప ఉలిక్కిపడింది. మిగిలిపోయిన కనకాంబరాలు పక్కనున్నాయి.

"రండి. రండమ్మా!... యింకా ఏం సేత్తన్నారూ ... నాయనగోరూ, అమ్మగోరూ వచ్చేత్తుంటే!

గబగబా పూలతోటలోపలికి పరిగెత్తింది. మళ్ళీ బయటకు వచ్చింది.

వాకిట్లో టాక్సీ ఆగి ఉంది. అప్పటికే అమ్మమ్మ ఎట్టనీళ్ళతో సిద్ధంగా ఉంది. ఒక్కొక్కరే కారు దిగుతున్నారు. పాప వళ్ళంతా కళ్ళు చేసికొని చూస్తున్నది.

నాన్నకాబోలు దిగేది... వంగి తమ్ముడిని ఎత్తుకున్నాడు. నాన్న... అచ్చు ఫొటోలోలాగే వున్నారే... కాస్త లావయ్యారు.

తమ్ముడు... అబ్బ... ఎంత బాగున్నాడో... తెల్లగా బొద్దుగా నుదిటిమీద జుట్టు... వెంటనే పరుగెత్తుకుని వెళ్ళి ఎత్తుకోవాలనిపించింది పాపకు కానీ కాళ్ళు కదలలేదు.

అమ్మ దిగుతోంది...

అమ్మ విశాలమైన కళ్ళు విస్ఫారితమైనాయి. అమాయకమైన పాపముఖం ఆశ్చర్యానికి ఆలయమైంది.

అమ్మమ్మ. తాతయ్య కూడా ఆశ్చర్యపోయారు. అమ్మమ్మ నెమ్మదిగా సంబాళించుకొని ముందుకు వెళ్ళింది— ఎట్టనీళ్ళతో దృష్టి తీయడానికి.

తాతయ్య ఆహ్వానించాడు "రండి! రండి!"

పాప ఆశ్చర్యంగా తాతయ్యవంక చూసింది. ఎప్పుడూ వినిపించని ఆ కంఠధ్వనికి. "చూశావా నీ కూతుర్ని" నవ్వుతూ అమ్మమ్మ చెయ్యి పుచ్చుకు లాగింది పాపను. పాపకు ఎందుకో సిగ్గు ముంచుకు వచ్చింది. వాలిన కనురెప్పల్ని బరువుగా యెత్తుతూ నవ్వింది. ఆప్యాయంగా చూస్తున్న అమ్మచూపులో ఏదో వెలితి కనిపించింది పాపకు.

తల్లి. తండ్రి కాఫీ తీసుకోవడానికి లోపలికి వెళ్ళగానే. మెల్లిగా గదిలోకి వచ్చింది పాప. వళ్ళంలో పోసిన కనకాంబరాలు ముద్దగా కడుతున్న పూలదండను చూస్తుంటే... అరగంట క్రింద వున్న వుత్సాహం .. తిరిగినట్లయింది. తన చేతుల్తో వత్తుగా బారుగ దండకట్టి అమ్మకి యివ్వాలని. పువ్వెళ్లూరిన మనస్సుకి ఆ దండ చూడగానే ప్రాణం ఉసూరుమనిపించింది.

బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసులో పనిచేసే మేరీ జుట్టులాగ. మెత్తగా పొట్టిగా బుజాలపైకి వదులుగా వ్రేలాడుతున్న అమ్మ జుట్టు కళ్ళ ముందు మెదలింది. ఒకసారి తలెత్తి గోడమీద ఉన్న ఫొటో వంక చూసింది. అప్పటికి తల్లిలో మార్పు. వద్దనుకున్నా పాపకి అసంతృప్తి కలిగిస్తున్నది. బాబ్డ్ హెయిర్. కనుబొమ్మల మధ్య సూదితో పెట్టుకున్నట్లుగా వున్న బొట్టు కనిపించకుండా ఉంది. మాసిపోయిన లిప్‌స్టిక్‌తో వెలిసినట్టున్న పెదిమలు. స్లీవ్‌లెస్ జాకెట్. వంటిమీద ఉందా లేదా అన్నట్లున్న నైలాన్ చీర.

అసలే వెలిసినట్టున్న మనోమ్ముదమీద కొత్త రూపం యిమడనంటున్నది. మనసంతా యేదోగా అయింది. మెల్లిగా గది వదలి యివతలికి వచ్చింది. వంట యింటి వైపు వెడుతూ ఏవో మాటల్లో... తనను గురించిన మాటలు వినిపించడంతో ఉత్సుకతతో ఆగిపోయింది.

"ఏమిటమ్మా... దానికా పమిటలు పావడాలూనూ. 13 సంవత్సరాలన్నా నిండలేదూ!"

"అదేమిటమ్మా. కాలుజారుపిల్ల ... పెద్దదయ్యే వయస్సు వచ్చింది. పమిటలు వేయించద్దూ! ఏమోనమ్మా! ఏదో నాకు తెలిసినట్లు పెంచాను. ఇంక నువ్వు వచ్చావు గదా! నీ యిష్టం...

"సరేగానీ, యిదేమిటమ్మా. తొమ్మిది జతల గాజులుండాలి... ఒక్కజతన్నా చేతికి లేదు... బారెడుజడ యెంత అందంగా ఉండేది. అలా కత్తిరించుకున్నావేమిటి" అంటోంది అమ్మమ్మ అసంతృప్తితో.

"ఆ! ఆ దేశాల్లో కుదరదమ్మా! గిన్నెలూ అవీ అన్నీ నేనే తోముకోవాలి. గాజులవీ వుంటే వీలుగా ఉండదు. షాంపూలతో స్నానం ...... చిక్కు తీసుకోవటం. ఆరబెట్టటం యివన్నీ పెద్దపని. ఇప్పుడు ఎంతో సుఖంగా వుంది. పైగా అంతా నా వంకే చూసేవాడు. ఎంత పెద్ద జడో అని" విసుగ్గా సమాధానం యిస్తోంది తల్లి.

రాత్రంతా నిద్ర పట్టలేదు. పాపకు తమ్ముడిని ఎన్నిసార్లు పిలవబోయినా ఒక్కసారి దగ్గరకు రాలేదు మాట్లాడదామంటే ఒక్కమాట అర్థంకాదు. అపూర్వ్ స్కూల్లో ఎనిమిదవ

## గాథావళి - 294

# ఉపాయం తోచని న్యూటన్

ఐజాక్ న్యూటన్ ఒకసారి, తాను కూర్చున్న స్థలానికి ముందున్న అడ్డు కమ్మీలు వేసిన ఇనుప చట్రం (Grate) లో నిప్పువేయమని నౌకరును ఆజ్ఞాపించాడు.

నిప్పువేసిన తర్వాత, కొంచెంసేపటికి నిప్పు బాగా రాజుకొని. విపరీతమైన సెగ రావడం ప్రారంభించింది. న్యూటన్ అత్యంత వేడిమిని భరించలేక భయంతో గంట మ్రోగించాడు. నౌకరు వచ్చేటప్పటికి, న్యూటన్ చాలావరకు ఉడికిపోయాడు. నౌకరుతో ఇనుప చట్రాన్ని దూరంగా తొలగించవలసినదని ఆజ్ఞాపించాడు.

అప్పుడు నౌకరు అడిగాడు — "మీ కుర్చీని కొంచెం అవతలికి జరుపుకోవలసినది గదా!"

అప్పుడు న్యూటన్— "నిజమే! అయితే, నా కావిషయం తోచలేదు." అని చెప్పాడు.

"శ్రీ వాసవ్య"

# ఎదురు చూసిన క్షణం

క్లాసు చదివేపాపకు ఇంగ్లీషు రాయడం. చదవడం వచ్చుగాని, మాట్లాడడం రాదు. తల్లి, తండ్రి. తమ్ముడు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుతుంటె. తనే యేమిటో పరాయి దానిగా మిగిలిపోయాననిపిస్తున్నది. ఎంత వద్దనుకున్నా ఏదో వెలితి, బాధ, ఏదో చేతకాదన్న భావం పాప మనస్సుని కలవరపరుస్తున్నది.

మర్నాడు ప్రొద్దున్న స్నానం చేసి రాగానే. తల్లి పిలిచింది... లెదర్ కేస్ ఓపెన్ చేసి. పాపకోసం తెచ్చిన వస్తువులు అన్నీ తీసి ముందర వుంచుతూ "నాతో అమెరికా వస్తావా" అంది.

తల అడించింది ఎటూ కాకుండా!

"మరి ఆ దేశంలో యిలాంటి బట్టలు వేసుకుంటే బాగుండదు. ఈ బట్టలు వేసుకోవాలి" అంటూ సూట్ కేస్‌లోంచి ఒక జత తీసి చేతికిచ్చింది." ఇవి వేసుకో !"

అయిష్టంగానే అందుకుంది పాప. మెత్తటి పిల్కు మెరిసిపోతున్నది. చేతిలో ఉందో లేదో అన్నంత తేలిగ్గా ఉన్నాయి. మెల్లిగా గదిలోకి తీసికెళ్ళి ఆ బటలు వేసుకొంది. అవి వేసుకొన్నాక, అసలు బట్టలు వేసుకున్నానన్న భావనే రాలేదు పాపకు. మోకాలు దిగని ఫ్రాక్ కి. చేతులుకూడా లేవు.. గంపెడు కుచ్చెళ్ళతో బరువుగా ఉండే పరికిణి కట్టుకునే పాపకు సిగ్గుగా ఉంది. ఆ గదిలోంచి బయటకు వెళ్ళలేక పోయింది.

ఇంతలో తల్లి గబగబా గదిలోకివచ్చి ఒకసారి పైనించి క్రిందదాకా తృప్తిగా చూసి..."చూడు ఎంత చక్కగా ఉన్నావో... రా నేను జడ వేస్తాను" అంది.

వదులు వదులుగా. నల్లత్రాచుల్లాటి జడలు రెండువైపులా ఊగుతున్నాయి. సూది మొనతో పెట్టిన బొట్టు మబ్బులవెనక చుక్కలా వెలవెల బోయింది.

"వెళ్ళ డాడీ ఫొటో తీస్తారట. పాస్‌పోర్ట్ కోసం." బయటకు తరిమింది పాపను.

గడప దాటుతుండగానే రాములు......
"యేందమ్మో బుల్లెమ్మగోరు..యెమెరికా యాసం యిక్కడే యాసింద్రు" ముసి ముసిగా నవ్వాడు. సిగ్గుతో చితికిపోయింది పాప. ఫొటో తీసే దాకా ఎలాగో అలా నుంచుని, వెంటనే లోపలికి పరిగెత్తి బట్టలు మార్చుకొంది.

* * *

ఇప్పుడు పాప మనసులో నెల రోజులనుంచి ఒక్కటే దిగులు. అమ్మ, నాన్న తనని ఎంతో బాగా చూస్తారు. అన్ని యిస్తారు. కానీ...ఏదో వెగటు...అమ్మ పనులే తనకు నచ్చవు. కత్తిరించుకొన్న జుట్టు, చేతుల్లేని జాకెటు, ఆ చెంచాలు, ఫోర్కులతో భోజనం, తనకీ జుట్టు కత్తిరిస్తానంది అమ్మ. ... ప్రతిదానికీ థాంక్యూ. చెప్పమంటుంది అమ్మ. ప్రొద్దున్నే చద్దన్నం తినకూడదంటుంది. ఆ బ్రెడ్...వెధవ రొట్టె... చక్కగా వేడి వేడి అన్నంలో మీగడ పెరుగేసుకొని నిమ్మకాయ ముక్కతో అన్నం తింటూంటే...... కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి పాపకు .. ఏదో దిగులు... చెప్పలేని దిగులు మనసంతా ఆవరించింది. ...అమ్మమ్మ, తాతయ్యను వదలాలి... ఏమిటో ఆ దేశంలో... రెండు నెలలనుంచి ..పాప తల్లి సీతకు ఒకటే భయం...రెండు నెలలుగా ట్రయినింగ్ యిస్తున్నా, పాపలో చీమంత మార్పు కనిపించలేదు. ఎంత చెప్పినా, తట్టెడు బంతిపూలు తల్లో పెట్టుకొని పెత్తనానికి బయలుదేరుతుంది. ఆ వెధవ గొబ్బెమ్మలు, చెమ్మ చెక్కలు, తప్ప యింకో ధ్యాసలేదు. కాస్త నాజూగ్గా...తినాలని ఎంత చెప్పినా ముప్పొద్దులా. యింత అన్నం పెట్టుకొని...

రేపు ఆ దేశం వెళ్ళగానే. ప్రొఫెసర్ డగ్లస్ వాళ్ళంతా డిన్నర్‌కి పిలుస్తారు. ఫార్మల్‌గా, ఆ డైనింగ్ టెబుల్స్. ఆ మిల్స్...అవన్నీ దీనికెట్లా అలవాటు చేయడం... ఆ మిసెస్ సుధాకర్ వాళ్ళంతా ఏమనుకొంటారో... దిగులుగా నిట్టూర్చింది.

పాపకు పాస్‌పోర్ట్ వచ్చింది. వీసా కోసం మద్రాసు తీసికెళ్ళాలి. సన్నాహాలు జరుగుతున్నాయి.... పాపకు, అమ్మమ్మకు కూడా దిగులుగా ఉంది. "పుట్టినప్పటినుంచీ పెంచి, పంపించాలంటే పైకి ఏమీ అనకపోయినా, కూతురు పద్ధతులు ఆవిడకేం నచ్చలేదు .. ఎనిమిదేళ్ళకు



"నా యెనక ఎవరోను నవ్వినట్టుంటాది"
చిత్రం : డి. సత్యనారాయణరెడ్డి, తెనాలి

వచ్చిన కూతుర్ని ఏమనడానికి మనస్సంగీకరించడంలేదు. తన కట్టుబాట్లల్లో పెంచిన... తన కూతురే యిలా తయారైతే రేపు... ఆ అమెరికాలో... ఆడామగా తేడాలేకుండా వయసొస్తున్న పిల్లని పెంచితే యింకేమైనా వుందా !" అనుకొని నిట్టూర్చింది.

"అమ్మడూ" అంటూ పెట్టె సర్దుతూన్న సీత గదిలోకి వెళ్ళింది.

"వచ్చేవారం వెళ్ళిపోవాల్సిందే ...."ఇంకో నాలుగు రోజులు ఉండడానికి వీలులేదూ."

"అబ్బే !... యివి స్పెషల్ ప్లేన్స్. రాను పోనూ రోజు వాళ్ళే నిశ్చయం చేసేస్తారు. ఆ ప్రకారం వెళ్ళకపోతే. బోలెడు డబ్బు కట్టుకోవాలి మళ్ళీ."

"అయితే... పాపను తీసుకుపోవడమేనా..!"

తలయెత్తి చూచింది సీత. "ఏం !"

"అహ ! యేం లేదు పుట్టినప్పటినుంచి నా దగ్గరే పెరిగింది. విడిచి ఉండాలంటే..."

సీత నవ్వింది. "నే పెరగలేదూ !"

ఆవిడకూడా నవ్వింది. "పెరిగావులే !... ఏదైనా పెళ్ళయ్యే వరకే ! ...... అహ! అది కాదు... ఆ దేశంలో ఆడా... మగా... కలిసి పెరుగుతారుట. రేపో మాపో పెద్దదయ్యేపిల్ల... అక్కడ పెరిగితే... మళ్ళీ యిక్కడకు రావడం పెళ్ళీ పేరంటం..."

"ఇంతకీ...ఏమంటావు అంది?" దడాల్న మూతవేసి తాళం వేస్తూ—

"పోనీ ఉంచేసి వెళ్ళరాదూ... ఏదో నేనూ, నాన్నా బాగానే ఉన్నాం..." నసుగుతూనే అంది కూతు రేమంటుందోనని వెనకాడుతూనే.

క్షణకాలం నిశితంగా చూసింది సీత ... "చూద్దాం లే ... ఆయనతో కూడా మాట్లాడి "..."

ఆశ్చర్యపోయిందావిడ. కూతురంత తేలికగా వప్పుకొంటుందని అనుకోలేదు.

ప్రక్క సావిడిలో ప్రతి అక్షరం పొల్లుపోకుండా వింటూనుంచున్న పాప కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, అయినా గుండెల నుండి యేదో బరువు దిగినట్లయింది.

వాకిట్లో టాక్సీ ఆగివుంది. సామానులన్నీ హడావిడిగా పెడుతున్నారు ...అమ్మమ్మ. తాతయ్య కళ్ళు తడి తడిగా ఉన్నాయి మళ్ళీ ఎన్నేళ్ళకో చూడడం ...

కొత్త బట్టలు కట్టుకొని, అమ్మమ్మ. తాతయ్యకు దణ్ణాలు పెడుతున్న అమ్మా, నాన్నను చూస్తుంటే, అప్రయత్నంగా నవ్వు వచ్చింది పాపకు. ఎన్ని అలవాట్లు మార్చుకొన్నా, కొన్ని మిగిలివుంటాయి కాబోలు ననిపించింది పసి పాప హృదయంలో ..

కారు వెళ్ళి పోయింది.
బుగ్గలు తడిసిపోయాయి.
వెలితి నిండిన మనసు విలవిల్లాడింది.